
ప్రజాశక్తి
సోమవారం 27 మే 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు

ఈవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరి నారాయణన్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రోజువారీ తనిఖీల్లో భాగంగా ఆదివారం కను పర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

ఏం కొనాలి.. ఏం తినాలి..!

ప్రభుత్వం అనేక పథకాల పేరుతో ప్రజలకు అనేక సాయం చేస్తుందని ప్రచారం చేసుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణలో పూర్తిగా విఫల మౌతు న్నాయి. ఒకటి కాదు.. పది కాదు. ఏడాది తరబడి నిత్యవసర ధరలకు సామాన్యులకు పెను భారంగా మారుతున్నాయి. పప్పులు ధరలు కొండెక్కుతున్నాయి. కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మాంసం ధరలు అధికమే. ఉప్పు, సబ్బులు, సాధాణంగా వాడుకొనే అన్ని వస్తువులు ధరలు ఒక్క రోజు ప్రజలకు సాధరణ ధరలకు అందడం లేదు. ధరల నియంత్రణకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా, ధరలను అందుపులో పెట్టడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియని పరిస్థితులు నెల కొన్నాయి. రెండు నెలల నుంచి ఎన్నికల హడావుడి ఉండడంతో ధరలు విషయంలో ఎవరూ పట్టించుకోవడంలేదు.

- ◆వెజిటేరియన్.. నాన్‌వెజ్‌ల ధరలు పైపైకి..
- ◆కేజీ కందిపప్పు రూ .189
- ◆చికెన్ రూ. 300
- ◆కూరగాయలు తగ్గేదేలా..
- ◆నిత్యావసర ధరల మంటలు
- ◆సామాన్యుడికి ఆర్థిక ఇబ్బందులు





ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. రోజు వారి కూలీలు, చిన్న చిన్న ఉద్యోగులు పౌష్టిహారం తీసుకోడానికి అవసరమైన పప్పుదినుసులు, కూరగాయలు కొని , తినే పరిస్థితులు కనిపించడం లేదు. పెట్రోల్, డీజల్ ప్రభావం ఒక వైపు, ఇతర అంశాలు కలిపి ఇబ్బందులు గురిచేస్తున్నాయి. బిజెపి అధికారంలోకి రాక ముందు డీజల్, పెట్రోల్ రూ 60-65 మధ్యలో ఉండేది. ఇప్పుడు పెట్రోల్ రూ 112, డీజల్ రూ 100 చేరింది. క్రూడాయిల్ ధరలు తగ్గిన తర్వాత తగ్గుతాయని చెప్పినా ఇప్పటి వరకు అలాంటి ప్రయత్నాలు ఏమీ చేయలేదు. ఇదే సమయంలో సర్దుబాట్ల పేరుతో అన్ని రకాల ధరలు నింగినంటుతున్నాయి. రోజు కూలీలు, చిన్న చిన్న ఉద్యోగులు ఒకప్పుడు తమ జీతంలోని 25 శాతంతో నెలవారి ఇంటి సామాగ్రి తెచ్చుకునే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు తమ నెల జీతంలో 50 శాతం నిత్యవసర వస్తువుల కొనుగోలు కోసమే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆర్థికంగా బలంగా ఉన్న వ్యక్తులకు ఇబ్బందులు లేకపోయినా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మాత్రం ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. పోషకాహారం తీసుకోవాలని పదేపదే ప్రకటనలు చేసే ప్రభుత్వం ధరల నియంత్రణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. బడా కంపెనీలు తమ ఉత్పత్తులపైనా భారీగా ధరలు పెంచుతున్నాయి. దీనికి ప్రభుత్వ విధానాలే కారణంగా చెబుతున్నారు. పెరిగిన ధరలకు ఆయా వస్తువులు లేకుండా వంటకాలు చేసుకోడానికి అలవాటు పడుతున్నారు.

కేజీ కందిపప్పు రూ 185

ప్రజలు నిత్యావసర ధరల విషయంలో మౌనంగా రొదిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ధరలు పెరగడం పరిపాటి. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కారణంగా ఏడాది పొడవునా ధరలు నియంత్రణ లేకుండా పోతున్నాయి. ఫలితంగా ధరలు తగ్గుమఖం పట్టడం లేదు. రెండు నెలల నుంచి ఎన్నికల వాతావరణం ఉండడంతో ధరలు నియంత్రణ లేకుండాపోయింది. గతంలో కేజీ రెండెంకులు మాత్రమే ఉన్న ధరలు ప్రస్తుతం మూడంకెలు తగ్గడం లేదు. మార్కెట్‌లో ప్రస్తుతం కందిపప్పు కేజీ రూ 185, చింతపండు రూ 200, తెల్లగడ్డలు రూ 250, ఎండుమిరప రూ 250 నుండి 300, మినపప్పు రూ 120, వేరుశనగ పప్పు రూ 145, తినేశనగలు రూ 100 కూరగాయలు ధరలు తామేమి తక్కువ కాదంటున్నాయి. ఉల్లిపాయలు కేజీ రూ 40 వరకు ఉంది. ఒకప్పుడు కేజీ రూ20 -30 పలికే ధరలు ఇప్పుడు పావు కిలో రూ 25 నుండి 30 పలుకుతున్నాయి. కేజీల లెక్కల ధరలు చెప్పడం లేదు. నిత్యం పెరుగు తోన్న , నిత్యవసర ధరలు సామాన్య ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తు న్నాయి. ప్రభుత్వాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయాలు ధరలు పైపైకే..!

సందేట్లో సడేమియా అన్నట్లు ఉంది పరిస్థితి. కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి మరోవైపు చికెన్, మాంసం ధరలు అంతకంటే ఎక్కువగా ఉన్నాయి. ఆదివారం చికెట్ కేజీ రూ 300 పలికింది. మటన్ రూ 900 నుంచి రూ. వెయ్యికి చేరింది. కూరగాయల ధరలు ఉల్లిగడ్డ కేజీ రూ 40, బెండకాయ రూ 80, దొంగ కాయ రూ 60, వంకాయ రూ 80, కాకర కాయ రూ 80, చిక్కుళ్లు రూ 60, బీట్‌రూట్ రూ 60, క్యారేట్ రూ 60, బీనీసు రూ 140, పందిరి చిక్కుళు రూ 100 వరకు ధరలు ఉన్నాయి. ఒక వేళ కేజీ కన్నా తక్కువ తీసుకుంటే రూ. 5 రూ 10 అదనంగా ఉంటుంది. ఈధరలతో జనం బెంబే లెత్తిపోతున్నారు.



కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - నెల్లూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విధులు కేటాయించబడిన సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరి నారాయణన్ సూచించారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యూ కళాశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను కలెక్టర్ పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని సందేహాలను ముందుగానే నివత్తి చేసుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. జూన్ 4న కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, నుడా విసి బాపిరెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అడిష నల్ కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఉన్నారు.

9న సిఎంగా మళ్లీ జగన్ ప్రమాణస్వీకారం..!

జిల్లాలో ఎన్నికల అధికారుల పక్షపాతం - మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

జూన్ 9వ తేదీన జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నారని, విశాఖ పట్నంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు సాగుతున్నాయని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పదికి పది స్థానాలు వైసిపి గెలుస్తుందని, ఇందులో తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తమ పార్టీని గెలిపిస్తున్నాయని తెలిపారు. 9వ తేది విశాఖపట్నంలో జగన్‌మో హన్‌రెడ్డి సిఎంగా ప్రమాణం చేస్తారన్నారు. అందుకు సంబందించి ఏర్పాట్లు పార్టీ చేస్తుందని చెప్పారు. జిల్లాలో ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో గతంలో ఎన్నడూ జరగనంత పక్షపాతం జరిగిందని ఆరోపించారు. పోలీసు అధికారులను బదిలీ చేసి, తమకు అనుకూలంగా పోలింగ్ జరుపుకున్నారని విమర్శించారు. మాచర్ల సంఘటన వీడియో ఎలా బయటకొచ్చిందో చెప్పలేని స్థితిలో ఇసి ఉందన్నారు. జిల్లా వ్యాపితంగా పోలింగ్ రోజు ఓటర్లుకు కనీస వసతులు లేవన్నారు. మంచినీరు, టెంట్లు, భారీగేట్లు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారన్నారు. గతంలో అనేక ఎన్నికల్లో చీఫ్ ఏజెంట్‌గా పనిచేశానని, ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. సర్వేపల్లి టిడిపి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నోట్లు పంచుతూ ఉండే వీడియోతో సహ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మానవత దృక్పథంతో నగదు పంచారని నివేదిక ఇచ్చారన్నారు. ఎన్నికల సమయంలో మానవత దృక్పథంతో నగదు పంపిణి చేయవచ్చునని ఎన్నికల అధికారులు ఎలా చెబుతారన్నారు. టిపి గూడూరులో సోషల్ మీడియాలో వచ్చిన ఒక వీడియో అధారంగా కేసు నమోదు చేశారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పక్షపాత దొరణితో ఇలా వ్యవహరించారని విమర్శించారు. ఈ పరిస్థితి చూస్తుంటే కౌంటింగ్‌లోనూ జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ సక్రమంగా నిర్వహించే పరిస్థితి కనిపించడ లేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. సోమిరెడ్డి నగదు పంపిణి విషయంలో హైకోర్టుకు వెళ్తామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :

కోడి పందేలు స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందెంరా యుళ్లతో పాటు, కోళ్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జంపాని కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.తోటపల్లిగూడూరు మండలం మండపం పంచాయతీ గొల్లపాలెం సమీపంలోని జమాయిల్ తోటల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు.

దాడి ఘటనలో నలుగురు పందెం రాయుళ్ళ, మూడు పందెం కోళ్ళు, రూ. 3,460 పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. అదుపులోకి తీసుకొన్న వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ జం పాని కు మార్ తెలిపారు. చట్టవ్యతిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ జంపాని కుమార్ హెచ్చరించారు.



కార్మికులకు ప్రశంసలు..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు


రాష్ట్రస్థాయి వంటల పోటీల్లో మండలానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు ప్రశంసలు అందుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకం (ఎండిఎంఐఏ) ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు విజయవాడలో ఈనెల 23, 24 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఈ శిక్షణ కార్యక్రమాలకు మండలనికి చెందిన మ ధ్యాహ్న భోజనం కార్మికుల యూని యన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మి రెడ్డి రేవతి, పి. శినమ్మలు హాజర య్యారు.కార్మికులకు రాష్ట్రస్థాయిలో పిఎం పోషణ వంటల పోటీలు నిర్వహించ డం జరిగింది. ఈ పోటీలలో రేవతి, శినమ్మలు సిద్ధం చేసిన వంటలు ఎం పిక అయ్యాయి. ఈ సందర్భాన్ని పు రస్కరించుకొని నిర్వాహకులు శీన మ్మ, రేవతిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో నిర్వ హించిన వంటల పోటీలలో ప్రశంసా ప త్రాలను అందుకొన్న శీనమ్మ, రేవ తిలను ఎండిఎం కా ర్మిక యూనియ న్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

కొనసాగుతున్న పందేల జోరు

ఒక్కరోజులో రూ. 3 కోట్ల పందెం - బెట్టింగులన్నీ ప్రభుత్వ ఏర్పాటుపైనే..

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలో పందేల జోరు కొనసాగుతుంది. ఆదివారం ఒక్క రోజు కోట్ల రూపాయల పందెం టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య జరిగింది. తెలుగుదేశం కూటమి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రూ. 2 కోట్లు పెట్టగా వైసిపి అధికారంలోకి వస్తుందని రూ. కోటి రూపాయలు పెట్టారు. టిడిపి శ్రేణులు రెండు రూపాయలు పెడితే వైసిపి వారు మాత్రం ఒక్క రూపాయివంతున పందేలు వేశారు. కోటి రూపాయలు వైసిపి శ్రేణులు కలపగా రూ. 2 కోట్లు తెలుగుదేశం శ్రేణులు కలిపారు. ప్రభుత్వం ఏర్పాటుపై పందేలు జోరు కొనసాగుతున్నప్పటికీ కందు కూరు నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు , వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవుల గెలుపు ఓటములపై ఎలాంటి పందాలు కొనసాగడం లేదు. పందేలు వేయడానికి టిడిపి సిద్ధమైనప్పటికీ వైసిపి శ్రేణులు మాత్రం నియోజకవర్గ గెలుపు ఓటములపై పందాలకు రావడం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వ విషయంపై రూ. కోట్ల పందేలు కందుకూరు నియోజకవర్గంలో కొనసాగ ుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రూ. 3 కోట్ల రూపాయలు టిడిపి, వైసిపి శ్రేణులు ప్రభుత్వ ఏర్పాటు పై పందేలు కట్టారు. ఈ పందాలను కల్పించడానికి బ్రోకర్ల పెద్ద ఎత్తున ఏర్పడి మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు 10శాతం కమిషన్ బ్రోకర్లకు వచ్చే విధంగా వారి వద్ద ఒప్పందాలు కుదుర్చు కుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దళారులుగా కొనసాగు తున్న అనేకమంది ఎన్నికల పందేల మధ్య వర్తులుగా ఎర్పడి రూ. కోట్లు కట్టిస్తున్న పరిస్థితి కందుకూరులో కనిప స్తుంది. ఈ పందాల జోరు లెక్కింపు జరిగే వరకు కొనసాగే పరిస్థితి ఉంది.





మాట్లాడుతున్న నాయకులు

అవయవ దాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరులో "అమ్మా నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం ప్రారంభమైయింది. నేత్రదానంతో కార్నియల్ అంధుల జీవితాల్లో వెలుగులు నింపుదామని అవయవ దానంతో కొందరు అభాగ్యుల జీవిత కాలాన్ని పొడిగిద్దాం అంటూ సంఘం ఏర్పాటు సందర్భంగా పాగ్గోన్న వారు చెప్పారు. దేహదానంతో వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పిద్దాం. చర్మదానంతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలుద్దాం. కేశ దానంతో మహిళా కాన్సర్ రోగులకు భరోసానిద్దాం అని పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు "బుద్ధ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో "ధమ్మ చక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో "అమ్మా నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం "ప్రారంభిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ధమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ"2016లో గంజి ఈశ్వరలింగం సారథ్యంలో హైదరాబాద్ కేంద్రంగా ఈ సంఘాన్ని స్థాపించి నేటివరకు ఎంతో మంది అంధులకు నేత్ర దానం వల్ల చూపు రప్పించాంగలిగారన్నారు. బ్రెయిన్ డెడ్ రోగులనుండి కాలేయాలను, గుండెను దానం చేయించడం ద్వారా పలువురికి పునర్జన్మను ప్రశాదించగాలిగారు. ఎందరో దాతల శరీర దానం వల్ల వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడుతుందన్నారు. బి. వెంకటేశ్వర్లు, మాల కొండయ్య, బి భూషి సురేష్, ఎం బాలకోటయ్య, బాల బ్రహ్మం, గనివినేని శ్రీనివాసరావు, ఇనకొల్లు మస్తాన్నయ్య, చనమాల కోటేశ్వరరావు, ఎం లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

400 మందికి పైగా ఉద్యోగాలు

ప్రజాశక్తి-కందుకూరు

కార్పొరేట్ రంగంలో ఉద్యోగ సంక్షోభం నెలకొన్న ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ప్లేస్మెంట్స్‌లో అప్రతిహత విజయం సొంతం చేసుకుంటుంది. ఈ ఏడాది ఫైనల్ ఇయర్ విద్యార్థులు చివరి సెమిస్టర్ పరీక్షలు పూర్తి కాకముందే 400 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగాలు సాధించారని టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ ఆదివారం పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీ ఆదాని గ్రూపులో సైతం తమ విద్యార్థులు కాలూనడం "ప్రకాశం" ఇంజనీరింగ్ కాలేజీ సత్తాకు నిదర్శనమన్నారు. వార్షిక వేతనం రూ. 3 లక్షలకు పైగా వేతనంతో ఎంపికైన వారు 50 శాతం పైగా ఉన్నారన్నారు. విప్రో, ఆదాని తదితర ప్రముఖ కంపెనీలకు ఎంపికయ్యేందుకు అవసరమైన శిక్షణ మూడో సంవత్సరంలోనే ప్రారంభిస్తున్నామని విజయ్ శ్రీనివాస్ వెల్లడించారు. బెంగుళూరు కేంద్రంగా ఉన్న ఆల్ సెక్ ట ెక్నాలజీ (ఎంయన్‌సి) ఇటీవల జరిపిన ఇంటర్వ్యూ ఫలితాలను శుక్ర-శని వారాల్లో మెయిల్స్ ద్వారా పంపిందన్నారు. ఇందులో 50కి 33 మంది రూ 2 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక కావడం హర్షదాయ ాకమన్నారు.

సివిల్, మెకానికల్ విద్యార్థుల ప్రభంజనం

సమాజంలో చిన్న చూపుగా ఉన్న సివిల్, మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులు 80 శాతం పైగా ఉద్యోగాలకు ఎంపిక కావడం తమకు ఎంతో గర్వకారణమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న హుందాయ్ కంపెనీకి 20 మంది మెకానికల్ విద్యార్థులు ఎంపిక కావడం ఆ బ్రాంచ్ విద్యార్థులు సాధించిన ఒక రికార్డుగా ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సివిల్ విద్యార్థులు అదానికి ఎంపికై చరిత్ర సష్టించారన్నారు. వీరికి రూ. లక్షా పది వేల విలువ చేసే శిక్షణ ఉచితంగా ఇస్తారన్నారు. ఈ శిక్షణలో ఇచ్చే సర్టిఫికెట్ కు గ్లోబల్ స్థాయి విలువ ఉంటుందని ఆయన వెల్లడించారు.



ఉద్యోగాలకి ఎంపికైన ప్రకాశం విద్యార్థులు

చక్కా వెంకట కేశవరావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కందుకూరు

తమిళనాడులోని హోసూరులో హోటల్ హిల్స్‌లో అల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు కి ఆదివారం ఏసియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు కేశవ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ తనకు గౌరవ డాక్టరేట్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నేను చేస్తున్న ప్రతి సేవా కార్యక్రమంలో తన శ్రీమతి చక్కా వెంకట సుజాత, తన తల్లిదండ్రులు, తన కుటుంబ సభ్యులు, తన ప్రియ మిత్రుల సహాయ సహకారంతో తాను సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నానని తెలిపారు. తనకి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా వేలాదిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని, వారి అందరి ఆశీస్సులు ఎల్లవేళలా తనపై ఉండాలని, వారందరికీ కతజ్ఞతలు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న కేశవరావు

'వల్లూరి'కి ..

ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఆదివారం తమిళనాడులో హెూసూర్ లో హోటల్స్ హిల్స్‌లో రాష్ట్ర స్థాయి నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు కోటేశ్వరావుకి గౌరవ్ డాక్టరేట్ ప్రదానం చేశారు. సంఘం అభివృద్ధితాపటు తాను చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తిం పుగా కోటేశ్వరరావుకి డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ పోందిన కోటేశ్వరావుని స్నేహితులు బంధువులు అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న వల్లూరి కోటేశ్వరరావు



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -నెల్లూరు

పొదలకూరు రోడ్డులోని పద్మావతి కమిటీ ఎయిడెడ్ స్కూల్లో 2013-14 విద్యా సంవత్సరం లో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పద్మావతి స్కూల్ మేనేజ్మెంట్ వారి సౌజన్యంతో ఎం ఈ ఎఫ్ ఉమ్మడి జిల్లా వారి ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్ టెస్టులో నిర్వహించి అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక పారితోషకం ప్రదానోత్సవం చేశారు. డి.మురళీ మోహన్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీస్ వారి సతీమణి డాక్టర్ అనురాధ విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 25 వేలు, రెండవ బహుమతిగా రూ. 15 వేలు, మూడో బహుమతిగా రూ. 10 వేలు అందజేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు

పేదవారి సహయార్థం నిర్వహిస్తున్న ఎన్నో కార్యక్రమాల్లో భాగంగా ఐఎఫ్‌సి ఫౌండేషన్ కందుకూరు పట్టణంలో ఆదివారం ప్రతి ఇంటిలో దుస్తులు పాతవి, కొత్తవి వారికి సరిపోనివి, ఉపయోగపడనివి సేకరించి ఊరిబయట నివాసం ఉండే వద్దులకు, పిల్లలకు అందజేసింది. ఈ కార్యక్రమానికి మేము సైతం అంటూ సహకారం అందించిన ప్రతి ఒక్కరికి సంస్థ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ప్రెసిడెంట్ సాజిద్, సెక్రటరీ షంషేర్, ట్రజరర్ హఫీజ్, ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కందుకూరు


ఆనందం లోనే కాదు.. దుఃఖంలోనూ ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని ఉద్ఘాంటించారు. ఆ మిత్రులు. ఉలవపాడు మండలం భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2010వరకు చదివిన పూర్వ విద్యార్థులు కలయిక ఆదివారం ఘనం గా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతు ఈ కార్యక్రమానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థుల సత్కరించారు.



నేడు టీచర్ పాత్రపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

ప్రస్తుత సమాజంలో టీచర్ పాత్ర అంశంపై సోమవారం వాయినందన ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాసం కళ్యాణ మండపంలో వర్క్‌షాప్ జరుగుతుందని ఎ.పి.పి.ఎస్.ఎ. నిర్వాహకులు దేవినేని వెంకట రమణయ్య ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ శ్రీ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గౌరవనీయులైన ప్రయివేట్ స్కూల్ కరస్పాండెంట్లకు, ఉపాధ్యాయులకు ఎ.పి.పి.ఎస్.ఎ. కావలి వారు సువర్ణ అవకాశం కల్పించారని తెలిపారు. కావున ప్రతి కరస్పాండెంట్ తమ టీచర్లను కార్యక్రమంలో పాల్గొనే విధంగా చేయాలన్నారు. సమయం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం భోజన ఏర్పాటు కలదన్నారు.



క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తద్వారా విద్యను మెరుగైన ఫలితాలు సాధించవచ్చని శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో - శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షులు కంచి పరమేశ్వర్ రెడ్డి సౌజన్యంతో ఆత్మకూరు ప్రాంతంలోని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ ఏడాది (2023-2024) పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు ప్రాంత విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఆత్మకూరు ప్రాంత ప్రముఖుల కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆత్మకూరు ప్రజలు, ఆత్మకూరులోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు పాఠశాలలలో పదవ తరగతిలో మొదటి ద్వితీయ తృతీయ స్థానాలలో పాసైన మొత్తం 37మంది విద్యార్థులకు మూడు లక్షల ఇరవై వేల రూపాయల ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఆత్మకూరులో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ పదవ తరగతి విద్యార్థులకు కూడా నగదు బహుమతి అందజేసి తమ సేవా కార్యక్రమం నిర్వహించిన కంచి పరమేశ్వర్ రెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక కమిటీ

ప్రజాశక్తి-ఉదయగిరి



నియోజకవర్గంలో వైసిపి అరాచక పాలనలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి తీవ్రంగా ఆర్థికంగా సామాజికంగా వేధించారని అందువల్ల యువ నాయకుడు విద్యావంతుడు ప్రజా సేవకుడు కాకర్ల సురేష్ ఎంఎల్ఎగా గెలిచిన వెంటనే ఆయన అధ్యక్షతన కార్యకర్తల సంక్షేమ కమిటీ ఏర్పాటు చేస్తామని ఆదివారం నియోజకవర్గ టీఎన్ సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని వారి సమస్యలు తీసుకుంటాము, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే ఉదయగిరిలోనూ కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యకర్తల సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు. పార్టీకి వెన్నుముక్క లాంటి కార్యకర్తను కాపాడుకోవడమే తమ బాధ్యత అని అన్నారు.



యువత ఆర్మీలో చేరాలి

ప్రజాశక్తి-బిట్రగుంట


దేశం కోసం యువత ఆర్మీలో చేరాలని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సర్జన్‌రాజు ఆధ్వర్యంలో మా ఊరు - మా జవాన్ కార్యక్రమాన్ని రైల్వే హాస్పిటల్ వెనక ఉన్న బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిట్రగుంట పుట్టి ఆర్మీ జవాన్ల పనిచేసిన పి.నారాయణ, వై.సహదేవరెడ్డి, పి సాల్మన్ రాజ్, కే సుబ్బారావు, బి సుధాకర్, వై సుధీర్ రెడ్డి, వై విజయ ప్రతాప్ రెడ్డి, ఎస్ రాఘవేంద్రరావు, డాక్టర్ శ్రీదేవి ఆర్మీ జవాన్ల కుటుంబ సభ్యులకు గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు అధ్యక్షతన వారిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. వారికి మునగాల మాలకొండారెడ్డి ప్రత్యేక బిరియాని ట్రీట్‌ను ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ జవానులు వారి కుటుంబ సభ్యులను వదిలి దేశం కోసం రాత్రి, పగలు నిద్రాహారాలు మాని పహారా కాస్తుంటే మనం ఇక్కడ ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నామని, దేశంలో జవాన్ చేసే సేవ మరవు రానివని, వారిని వారి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అభినందిస్తుందని తెలిపారు. ఫౌండర్ ప్రెసిడెంట్ కుందుర్తి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఎఫ్ఎ రాజు, ట్రెజరర్ పి.జీవన్ కుమార్, సత్యనారాయణ, సెక్రటరీ ఎస్.కె.జిలాని, మన్యం శ్రీనివాసులు, బాబ్జి, జనార్ధన్, శేఖర్, శ్యామ్ సుధాకర్, బి రవిచంద్ర, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే విశ్రాంతి ఉద్యోగులు, యువత, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-కావలి



ఎస్.పి. ఆదేశాల మేరకు ఆదివారం కావలి-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్‌సెర్చ్‌ను నిర్వహించారు. ఇందులో సి.ఐ, ఎస్.ఐ. వారి సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిపి ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచడానికి ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను చేపట్టామన్నారు. ఈ ఆపరేషన్ లక్ష్యం పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకోవడమని తెలిపారు. సరైన పత్రాలు లేని 9 బైకులు గుర్తించామన్నారు.



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు, అరవపాలెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కావలి రూరల్ సిఐ బి.నాగభూషణం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగభూషణం మాట్లాడుతూ పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ మొదలవుతున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంతర సంఘటనలు జరగకుండా ఉండేందుకు బోగోలు మండలంలోని అన్ని గ్రామాలలో కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అనుమానితులుగా ఎవరైనా కనపడితే వెంటనే పోలీసుకు సమాచారం అందించాలని తెలిపారు. సరైన పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను ఒక ఆటోను గుర్తించి కేసు నమోదు చేసి వాటిని బిట్రగుంట పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ బొజ్జ, హెడ్‌కానిస్టేబుల్ విజయ్ ప్రసాద్, బిట్రగుంట, దగదర్తి, అల్లూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల కొరతతో ఇబ్బందులు

- **ఖాళీ లేకపోవడంతో డాక్టర్‌లకు నిరాశ**
- **కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, డిప్యూటేషన్‌లను ఆపి, సిబ్బందికి ప్రజాసేవపై అవగాహన ఇవ్వాలని వినతులు**

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు సంపూర్ణ వైద్యం అందించాలంటే 12మంది వైద్యులు ఉండాలి కానీ ఏడుగురు వైద్యులు మాత్రమే ప్రజలకు సేవలు అందించేవారున్నారు. వెనుకబడిన మెట్ట ప్రాంతం దౌర్భాగ్యం ఏమిటో వారిలో ముగ్గురు డిప్యూటైజేషన్‌లపై వివిధ ప్రాంతాలకు వారి నచ్చిన ప్రాంతాలకు పోస్టులు లేకపోయినా వెళ్లారని ఆరోపణ వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళలకు సేవలు అందించే గైనకాలజిస్ట్ డిప్యూటైజేషన్‌పై వెళ్లడంతో కాన్పులకు వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతారాంపురం, ఉదయగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన వివిధ అనారోగ్యాలతో బాధపడే ముఖ్యంగా మహిళలు ప్రతినిత్యం ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వస్తారు. సరైన సదుపాయాలున్న వైద్య సిబ్బంది లేకపోవడంతో సుదీర్ఘ ప్రాంతాలైన ఆత్మకూరు, నెల్లూరు ప్రయివేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో గైనకాలజిస్ట్ సేవలందించే సమయంలో నెలలో సుమారు 30, 40 కాన్పులు అయ్యేవి ఇటీవల ఓ మహిళలకు ఆపరేషన్ చేసి మండల ప్రజలు మన్నులను పొందారు. ఇప్పుడు మహిళా డాక్టర్ డిప్యూటైజేషన్‌పై వెళ్లడంతో కనీసం పది కాన్పులు కావడం లేదు. ప్రయివేట్ ఆస్పత్రులపై ఆధారపడి నిరుపేదలు వేలాది రూపాయలను చెల్లిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. డిప్యూటైజేషన్‌పై వెళ్లిన వైద్యులకు స్థానికంగా జీతాలు చెల్లిస్తూ ఉండడంతో వారి పోస్టులు వైద్యశాలలు ఖాళీగా లేకపోవడంతో సేవ చేసేందుకు వచ్చే వైద్యులు నిరాశ చెందుతున్నారు.



ఉదయగిరిలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి

డిప్యూటైజేషన్‌లపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి వెళ్లిన వారి డిప్యూటైజేషన్‌లను రద్దు చేసి ఉదయగిరి మెట్టప్రాంత ప్రజలకు సేవలు అందించేందుకు వచ్చే వైద్యులకు అవకాశం కల్పించి వైద్యులు కొరత తీర్చి మెరుగైన వైద్యం అందించాలని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నారు. మెట్టప్రాంతంలో అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నిర్మితమై ఉంది. గతం కన్నా ఏడాదిన్నర నుండి ఏడు మంది డాక్టర్లతో మెట్ట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజల మన్నులను పొందారు కానీ ఇక్కడికి వచ్చిన కొందరు డాక్టర్లు డిప్యూటైజేషన్‌పై వెళ్లడంతో మెట్ట ప్రాంత ప్రజలకు వైద్యం దూరమైంది.

అవగాహనతో మెరుగైన వైద్యం

వైద్యశాలకు వచ్చే వారిపై వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో వైద్యం అందించేలా సమావేశాలు నిర్వహించి ప్రతి సిబ్బందికి అవగాహన కల్పించాలి. దాంతో సిబ్బందిలో దురుసుతనం తగ్గి సేవాభావంతో మెట్టప్రాంత ప్రజలకు వైద్యసేవలు అదించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు ప్రజా సంఘాలు కోరుకుంటున్నారు.

దస్తగిరి అహ్మద్,
జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు



ఉదయగిరి మెట్ట ప్రాంతంలో వైద్యుల కొరత వెంటాడుతున్న ఇక్కడున్న వారు డిప్యూటైజేషన్‌పై ఇతర జిల్లాలకు జిల్లాలోని మరి కొన్ని ప్రాంతాలకు వెళ్లడం విడ్డూరంగా ఉందని జిల్లా ఉన్నత అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి డిప్యూటైజేషన్ తొలగించి విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఉదయగిరిలో ఉన్న పోస్టులను ఖాళీగా చూపి మెట్ట ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు వచ్చే వారికి అవకాశం కల్పించాలని కోరారు.

ఫర్హీన్ భాషా, సిపిఎం మండల కార్యదర్శి



ఉదయ గిరి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం లో గైనకాలజిస్ట్ మహిళ డాక్టర్ ను ఉదయగిరి కి తీసుకొచ్చేలా చేయాలని ఆమె ఎన్నో ఆపరేషన్లు చేశారని మహిళలు ఆమె వైద్యంపై అనేక నమ్మకాలు పెట్టుకున్నారని అలాంటి వారిని ఇతర ప్రాంతాలకు పంపడం బాధాకరమన్నారు. మహిళా డాక్టర్లు లేక అనేకమంది ఇతర ప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి ఎదురవుతుందని మహిళలను చూసే కాన్పులు చేసే డాక్టర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా వచ్చే రాజకీయ ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే డాక్టర్లు నియామకం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

- కావలి ఉమెన్ ఫోర్స్ సభ్యులు

ప్రజాశక్తి-కావలి

అత్యాధునిక రాకెట్ యుగంలో శాస్త్రసంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా.. భారతదేశంలో మూఢాచారాలను యథావిధిగా పాటించే తెగలు ఇంకా "దేవునితో బాలికలకు పెళ్లి" చేయడం అది కూడా బహిరంగంగా జరిగినా పోలీసులు, ప్రభుత్వాధికారులు కళ్ళప్పగించి చూస్తూ ఊరుకోవడం గర్హనీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఖండించారు. అనంతపురం జిల్లా, రాయదుర్గ పట్టణంలో శ్రీవెంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పద్మశాలి వంశానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను శ్రీవెంకటరమణ స్వామితో మౌనికకు తాళి కట్టించి వివాహం జరిపించడం "రాతి యుగంలోకి వెనక్కు వెళుతున్నదా మానవసమాజం" అనిపిస్తుందన్నారు. ఇలా కొన్ని తెగల్లో బాలికలకు దేవునితో పెళ్లి జరిపించి, పెద్దైన తర్వాత ఊరిపెద్దలు ఆ బాలికను ఊరి భార్యగా వాడు కోవడం అనే దురాచారంగా "దేవదాసి వ్యవస్థ" వచ్చిందని తెలిపారు. ఈ మూఢాచారాలను ఇలాగే కొనసాగిస్తుంటే ప్రభుత్వాధికారులు, పోలీసు శాఖ ప్రేక్షక పాత్ర వహించడం బాల్యవివాహ చట్టాన్ని ఉల్లంఘించి, బాలికల విద్య, సాధికారతలపై వేటు వేసినట్లేనన్నారు. బాలికను దేవునితో వివాహం జరిపించిన వారినందరినీ చట్టప్రకారం అరెస్టు చేసి కఠిన సెక్షన్లతో కేసును రిజిస్టర్ చేయాలన్నారు. ఈ దారుణం మహిళా కమిషన్ దృష్టికి రాకపోవడం లేదా, వచ్చినా.. పట్టనట్లుండటం అత్యంత గర్హనీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు సి.శారద, షేక్.ఫాతిమా, టి.సుజాత, అనూరాధ, షేక్.నూర్జహాన్, టి.లక్ష్మి, షమీమ్, జమీ తదితర సభ్యులు తెలియజేశారు.



బిపిఎస్ సెంటర్‌లో ఎంఎల్ఎ సందడి

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో నడిబొడ్డున ఉన్న బిపిఎస్ సెంటర్‌లో ఆదివారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సందడి చేశారు. బిపిఎస్ సెంటర్‌లో సన్నిహితులు, శ్రేయోభిలాషులు, వైసిపి నాయకులతో కలిసి కూర్చొన్న ఎంఎల్ఎ ఉదయాన్నే స్థానికులు కలిసి ఎంఎల్ఎగా హ్యాట్రిక్ సాధిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు.

నవమి ఉత్సవాలకు అనుమతుల్లేవ్..

ప్రజాశక్తి-మర్రిపాడు

ఎన్నికల కోడ్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున మండలంలో జూన్ 6 వరకు ఎటువంటి ఉత్సవాలు, ఊరేగింపులకు అనుమతులు లేవని ఎస్ఐ విశ్వనాధ్ రెడ్డి తెలిపారు. పోలీస్ వారికి తెలియకుండా ఎవరైనా గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు మరే ఇతర ఉత్సవాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెర్లో రమణారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం..

వర్ధంతి సభలో మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, కార్యవర్గ సభ్యులు కె.మోహన్ రావు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిరంతరం వైద్య సేవలు అందించిన ఏకైక వ్యక్తి డాక్టర్ చెర్లో రమణారెడ్డి అని మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, కార్యవర్గ సభ్యులు కె.మోహన్ రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో చెర్లో రమణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ముందుగా డాక్టర్ చెర్లో రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు వాసి మొట్టమొదటి డాక్టర్ చెర్లో రమణారెడ్డి మద్రాసులో చదివే క్రమంలో విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేశారని తెలిపారు. ఆయన విద్య పూర్తయిన వెంటనే నెల్లూరు పట్టణంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆసుపత్రిలో విశేష వైద్య సేవలు అందించారు. రూ.250 జీతానికి పనిచేశారన్నారు. అప్పట్లో జిల్లాలో డాక్టర్లు లేని కారణంగా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. ఆత్మకూరు తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి విశేష కృషి చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి అరెస్ట్ అయ్యి జైల్లో ఉన్న సమయంలో ఆసుపత్రిని నిలబెట్టడం కోసం సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ఎలక్ట్రోరల్ బాండ్లు, కార్పొరేట్ రాజకీయాలు అనే అంశంపై చర్చించారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్లు ఇవ్వడంపై వ్యతిరేకించిన పార్టీ ఏదైనా ఉందంటే ఏకైక పార్టీ సిపిఎం పార్టీ అని తెలియజేశారు. ఒక్క అసెంబ్లీకి రూ.120 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాజ్యసభకు రూ.300 కోట్లు ఖర్చు చేసి రాజ్యసభ సీటు సాధించుకున్న నాయకులు కూడా ఉన్నారని విమర్శించారు. దేశంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్లు తీసుకొని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని దానికి కారణం బిజెపి ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. అప్పటినుండి దేశంలో ఎన్నికల బాండ్లు ద్వారా ఎన్నికలు జరిపిస్తున్నారన్నారు. దేశంలో పేదల రాజ్యం రావాలని అందుకు అనుగుణంగా ప్రజలందరూ పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, కార్యదర్శి కొండమూరు హాజరత్తయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి కృష్ణప్రసాద్, సిపిఎం నాయకులు ఆళ్ల హాజరత్తయ్య, చెర్లో సుబ్బరామిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు, గంగాధర్, శివప్రసాద్, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, హరికిరణ్, పలువురు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్



వర్ధంతి సభకు హాజరైన ప్రముఖులు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు గ్రామ శివారులో వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తాళ్ల నాగార్జున రెడ్డి(45) శనివారం మధ్యాహ్నం నుండి కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఆదివారం గ్రామ చుట్టుపక్కల వెతకగా గ్రామ శివారులోని ఆవుల బీడు వద్ద మర్రి చెట్టుకు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి జరిగిన తీరుపై ఆరా తీశారు. శవ పంచనామా నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



పరిశీలిస్తున్న పోలీసులు

వైద్య శిబిరంలో ఎంఎల్ఎ పరిశీలన

ప్రజాశక్తి-కావలి

మండలంలోని సర్వాయపాలెం పంచాయతీ మాతిన వారి పాలెం గ్రామంలో ఇటీవల పలువురు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థకు గురవడం తెలిసిందే. వీరు కావలిలోని ప్రయివేట్ వైద్యశాలలో కొందరు చికిత్స పొందగా, సమాచారం అందుకున్న కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వెంటనే జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి మాతినవారిపాలెంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఆదివారం కావలికి వచ్చిన శాసనసభ్యుడు ప్రతాప్‌కుమార్ రెడ్డి శిబిరాన్ని సందర్శించారు. స్థానికుల్లో ప్రబలిన రోగ లక్షణాలు గురించి వారికి అందిస్తున్న చికిత్సల గురించి ఇక్కడ వైద్య సిబ్బందిని ఆరా తీశారు. మున్ముందు ఎలాంటి వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎంఎల్ఎ తెలియజేశారు. ఆయనవెంట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జెడ్‌పిటిసి జంపాని రాఘవులు, దామిశెట్టి శ్రీనివాసుల నాయుడు, సుధీర్, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జగదీష్ రెడ్డి, యానాదయ్య, తుళ్లూరు శ్రీనివాసులు, కెవి నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, తదితరులున్నారు.



వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి


స్థానిక విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వారి కార్యాలయంలో 60మంది వృద్ధులకు దాదాపు రూ.60వేల విలువైన నెలసరి బియ్యం, నిత్యావసర వస్తువులు, ఖర్చుకు నగదులను పంపిణీ చేశారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర్ కుమార్ రెడ్డిలు తమతండ్రి దొడ్ల రామచంద్రారెడ్డి (డి.ఆర్.) ఆశయాలను కొనసాగిస్తూ ప్రతినెలా వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ముఖ్య అతిథులు ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ శ్రీరామ్ మనోహర్ బాబు, ఆయన కుమార్తె శ్రీరామ్ మధులికలు కొనియాడారు. జె.బి. ఐ.ఎం.ఎస్. నర్సింగ్ కాలేజీ లెక్చరర్ ఉదయభాను మాట్లాడుతూ విశ్వోదయ సేవాసమితి సేవలను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ ప్రసాద్, సతీష్ సింగ్, రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ తెరకు 8 రోజులే..!

- **ఉదయగిరిలో జోరు మీదున్న ఇరుపార్టీ నేతలు**
- **నియోజకవర్గమంతా పందెం సందడి**

ప్రజాశక్తి వరికుంటపాడు

ఎన్నికల పోలింగ్ పూర్తయిన రాజకీయం మాత్రం మంచి కాక మీద ఉంది. ఏ పార్టీ గెలుస్తుందని పక్కన పెడితే గ్రామాలలో మాత్రం రాజకీయ వేడి ఏమాత్రం తగ్గినట్టు లేదు. చోటా మోటా నేతలు ఇప్పటికే ఊర్లు వదిలి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాల్లో పర్యటిస్తుంటే... లోకల్ నేతలు మాత్రం మా పార్టీ గెలుస్తుంది అంటే... కాదు మా పార్టీ గెలుస్తుంది అంటూ పందేలు కాస్తున్నారు. ఇదిలా ఉంటే వృద్ధులు రచ్చ బండల మీద, మహిళలు సైతం వీధి కొళాయిల వద్ద రాజకీయ రణరంగం సృష్టిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత పోలింగ్‌కు సుదీర్ఘకాలం వ్యవధి ఉండడంతో ఎన్నికల వ్యయం పెరగడంతో కేడర్‌ను నిరంతరం సంరక్షించుకోవడానికి ఎక్కువ మొత్తాన్ని వ్యయం చేయడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ఎన్నికల పోలింగ్ అయిందనేసరికి కౌంటింగ్ సమయం ఎక్కువ రోజులు ఉండడంతో అభ్యర్థులు ఆందోళనకు లోనయ్యారు. ఎలాగూ ఎన్నికల కోసం రాత్రింబవళ్లు కష్టపడి తిరగడంతో ఇప్పుడైనా రిలాక్స్ కోసం ఊరు వదిలి వేరువేరు ప్రాంతాలకు సేదదీరెందుకు వెళ్లారు. అసలు నేతలు ఇలా ఊర్లో లేకపోయినా రాజకీయ సందడి గ్రామాలలో మునిగి తేలుతున్నాయి. ఏయే గ్రామాలకు ఏయే పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి లెక్కలేసుకుంటూనే అందులో మన ఓట్లు ఎన్ని... ప్రత్యర్థికి పార్టీకి ఎన్ని అనే వాదోపవాదనాలతో ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. మరో 8 రోజుల్లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. జూన్ 4న గెలిచేది ఎవరో.. ఓడేది ఎవరో తెలియనుంది. కానీ అంతవరకు ఆగలేక ఇప్పటినుంచే తలరాతలను ఎవరు చెబుతారు అని ముందే ఫలితం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఫలితం రాకపోతే ఏంటనే లెక్కల్లోనూ కొందరు నేతలు తనముకలై పోతున్నారు. ఈసారి ఫలితం తమదే అన్నట్టుగా ప్రధానపార్టీలా ముఖ్య నేతలు వ్యవహరించడం కేడర్‌లో గందరగోళానికి దారితీస్తుంది. ఓటర్ నాడీ ఎవరికి అంతు పట్టకపోయినా ఊహించని విధంగా పెరిగిన ఓటింగ్ శాతంపై మాత్రం ఇరు పార్టీల నేతలు ఆశలు పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఎవరు ప్రణాళికను వారు అమలు చేసుకునేందుకు తహతహలాడుతున్నారు. సరిగ్గా ఎనిమిది రోజుల్లో కౌంటింగ్ పూర్తికానుంది. అంటే ఇన్ని రోజులు ఉత్కంఠకు ఆరోజు తెరపడనుంది. ఆ రోజు కోసం అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోనే ఉదయగిరికి ఒక ప్రత్యేకత ఉంది.





అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి-అనంతసాగరం

అనంతసాగరం మండల కేంద్రం పారిశుధ్యం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. ప్రధాన రహదారులు, కాలువల్లో పూడిక తీయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ వెనుక భాగం రహదారివెంట చెత్త కుప్పలు ఉండడంతో చెత్తాచెదారం ఇళ్లలోకి వస్తూ దుర్వాసన వెదజల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయని, దాంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి చెత్త కుప్పలు మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరారు.